TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను, తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్ సంపుటి :01 సంచిక : 145 శనివారం 18-01-2025 పేజీలు :06 వేల : 05/-

# తొలి రోజునే కీలక ఒప్పందం

▶ సింగపూర్ ఐటీఈతో స్కిల్ యూనివర్సిటీ ఎంవోయూ

▶ నైపుణ్యాల అభివృద్ధికి పరస్పర సహకారం







**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 17 :** ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు తొలిరోజునే విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా తెలంగాణ రైజింగ్ టీమ్ శుక్రవారం సింగపూర్ లో పర్యటించింది. సీఎం రేవంత్ రెడ్డి వెంట ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్ వీ ఎస్ఎస్ సుబ్బారావు ఈ టీమ్లో ఉన్నారు. తొలి రోజునే తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్ ను సందర్శించింది. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవెలప్ మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించింది. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, సింగపూర్ ఐటీఈ ప్రతినిధి బృందం తరపున అకడిమిక్ అండ్ అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్వేందర్ సింగ్, ఐటీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ సంతకాలు చేశారు. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్ ను సందర్శించనుంది.

## బ్రిజేష్ ఆదేశాలు.. ముమ్మాటికి కేసీఆర్ ప్రభుత్వ విజయమే

- ◈ మొదటి నుంచి సెక్షన్ 3 ప్రకారం నీళ్లు కేటాయించాలని పట్టుబట్టిన కేసీఆర్
- ◈ తాజాగా ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం
- ◈ దీన్ని కూడా కాంగ్రెస్ తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు
- ◈ అసలు ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 89 తెచ్చిందే కేంద్రంలోని కాంగ్రెస్
- ◈ క్రిష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందే కాంగ్రెస్
- ◈ ఆ తప్పిదాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్ కు పట్టిన పదేండ్ల కాలం
- ◈ క్రిష్ణాలో న్యాయమైన వాటా దక్కేదాక బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుంది
- ◈ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు




**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 17 :** కృష్ణా జలాల కేటాయింపు విషయంలో 1956 అంత రాష్ట్ర జలవివాదాల చట్టం సెక్షన్ 3 ప్రకారం వాదనలు వింటామని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఆదేశాల పట్ల మాజీ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేసారు.పదేళ్ల పాటు నిర్విరామంగా కేసీఆర్ గారు చేసిన పోరాటానికి వచ్చిన ఫలితమే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తాజా ఉత్తర్వులని పేర్కొన్నారు. ఇది కేసీఆర్ ప్రభుత్వం పట్టుబట్టి సాధించిన విజయం అన్నారు. కృష్ణా జలాల కేటాయింపులు రాష్ట్రాల వారీగా ఉండాలి తప్ప ప్రాజెక్టుల వారీగా ఉండకూడదని మొదటి నుంచి కేసీఆర్ చేసిన వాదనతో ఎట్టకేలకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏకీభవించడం వల్ల నదీ జలాల కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. కేసీఆర్ కొట్లాడి సాధించిన విజయాన్ని సైతం తమ ఘనతగా చెప్పుకోవడం కాంగ్రెస్ పార్టీ భావదారిద్ర్యానికి నిదర్శనం అన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ గొప్పతనం అని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 89ని నాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీనే తెచ్చిందన్నారు. క్రిష్ణా నీటి వాటా విషయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు తీరని అన్యాయం చేస్తే, దాన్ని సరిదిద్దడానికి పదేండ్ల కాలం పట్టిందన్నారు.నీటి వాటాల్లో తెలంగాణ హక్కులు సాధించేందుకు ఆనాడు కేసీఆర్ గారు సీఎం హోదాలో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు హాజరై తెలంగాణ పక్షాన వాదనలు వినిపించారని, దీంతో తెలంగాణకు న్యాయం దక్కే అవకాశాలు మెరుగు పడ్డాయని గుర్తు చేసారు. తెలంగాణ ఏర్పాటు అయిన నెల రోజులకే సీఎం కేసీఆర్ ఆదేశాలతో, ఆనాటి సాగునీటి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నదీ జలాల వివాదాల చట్టం 1956, సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ కోసం ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలంటూ 14.7.2014 నాడే లేఖ రాసినట్లు తెలిపారు. అయితే కేంద్రం ఐఎస్ఆర్డబ్ల్యుడి యాక్ట్ చట్టానికి బదులుగా రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 ప్రకారం విచారణకు ఆదేశించింది. ఈ విచారణ వలన తెలంగాణకు న్యాయమైన వాటా లభించే అవకాశం లేదని సీఎం కేసీఆర్ భావించారు. అందుకే ఆయన నిరంతరాయంగా ఐఎస్ఆర్డబ్ల్యుడి యాక్ట్ 1956, సెక్షన్ 3 ప్రకారం పున: పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారు. క్రిష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా కోసం 2015లోనే నాటి కేసీఆర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిందన్నారు.అక్టోబర్ 2020 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ ఇదే అంశంపై తీవ్రంగా పట్టుబట్టినట్లు గుర్తు చేసారు.కేసీఆర్ ఒత్తిడికి తలొగ్గిన కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వం వేసిన కేసును విరమించుకునే షరతుపై ట్రిబ్యునల్ కి రిఫర్ చేయడానికి అంగీకరించిందన్నారు.అయితే కేసు విరమించుకున్న తక్షణమే ట్రిబ్యునల్ వేసేందుకు హామీ ఇవ్వాలని కెసిఆర్ పట్టు బడితే, మేము న్యాయ మంత్రిత్వ శాఖ సలహా తీసుకున్న తర్వాతనే ఒక నిర్ణయం ప్రకటిస్తామని నాడు కేంద్ర మంత్రి అన్నారని తెలిపారు. కేంద్ర మంత్రి షెఖావత్ ను మరొక సారి డిల్లీలో కలిసిన తర్వాత ఆయన హామీ మేరకు నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ కేసును విత్ డ్రా చేయాలంటూ అధికారులను ఆదేశించారని తెలిపారు. కెసిఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం 2021 జూన్ లో విత్ డ్రా పిటిషన్ వేసింది. సుప్రీం కోర్టు అక్టోబర్ 2021 లో పిటిషన్ అనుమతించిందన్నారు. కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అక్టోబర్ 2023వ తేదీనే సెక్షన్ 3 కింద నీటి విభజన కోసం ట్రిబ్యునల్ కు కేంద్ర ప్రభుత్వం టర్మ్స్ ఆఫ్ రెఫెరెన్స్ (%ూ=%) ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసారు. ఎన్నో వేదికల ద్వారా బీఆర్ఎస్ చేసిన పోరాట

2లో

## ప్రజావాణికి మొత్తం 3,053 దరఖాస్తులు




**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 17 :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 3053 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 111, విద్యుత్ శాఖ కు సంబంధించి 100, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 55, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 2691 దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 96 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## ప్రతీ రైతుకు ఎకరాకు రేవంత్ ప్రభుత్వం 17,500 బాకీ ఉన్నది



### - బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 17 :** కాంగ్రెస్ అభయహస్తం తెలంగాణ ప్రజల పాలిట భస్మాసుర హస్తంలా మారిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు. ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ కూడా సరిగా అమలుచేయకుండానే, అన్నీ చేశామని ఢిల్లీలో రేవంత్ గప్పాలు కొడుతున్నారని విమర్శించారు. కన్నతల్లికి అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బిర్యాని పెడ్తా అన్నట్టుగా, తెలంగాణలో ఒక్క హామిని కూడా అమలుచేయకుండానే ఢిల్లీలో అమలుచేయించే గ్యారంటీ తనదే అని రేవంత్ చెప్పుకోవడం తాను విన్న పెద్ద జోక్ అన్నారు. చేవేళ్ల నియోజకవర్గం షాబాద్ లో నిర్వహించిన రైతు దీక్షలో పాల్గొన్న కేటీఆర్, రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఎకరాకు 17500 రూపాయలను రేవంత్ బాకీ ఉన్నారన్నారు. తెలంగాణలోని ప్రతీ ఒక్కర్ని మోసం చేసిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మీద ప్రజలు చీటింగ్ కేసులు పెట్టాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అబద్దపు హామీలని నమ్మి

2లో

## ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేయాలి



▷ శాఖల వారీగా ప్రతినెలా ఖర్చు వివరాలు వెల్లడించాలి

▷ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2లో

మన వెలుగు
TEL:T/TG/2024/0814
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



## బ్రిజేష్ ఆదేశాలు.. ముమ్మాటికి కేసీఆర్ ప్రభుత్వ విజయమే

ఫలితమే తాజాగా సెక్షన్ 3 ప్రకారం వాదనలు వింటామని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చినమధ్యంతర ఆదేశాలన్నారు.ఒకవైపు సెక్షన్ 3 ప్రకారం నీటి వాటా జరగాలని శాశ్వత పరిష్కారం కోసం పోరాటం చేస్తూనే, మరోవైపు తాత్కాలికంగా నీటి వాటాను 50శాతంపెంచాలని పోరాటం కొనసాగించామన్నారు. ఇందులో భాగంగానే ట్రిబ్యునల్ ముందు 575 టిఎంసి ల నీటి వాటా డిమాండ్ పెట్టినట్లు గుర్తు చేసారు. %ఖ=వీదీ% సమావేశాల్లో, కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖల్లో ట్రిబ్యునల్ తీర్పు వచ్చేదాకా తెలంగాణకు కృష్ణా జలాల్లో 50శాతం వాటా ఇవ్వాలని నిరంతరాయంగా తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తూనే వచ్చిందన్నారు. ఇప్పటికే 10 ఏండ్ల విలువైన కాలం హరించుకుపోయింది. %జీబర్‌ఆఎవ నవశ్రీఖఎవస అం యబర్‌ఆఎవ నవఅఆవస% అనేది అందరికీ తెలిసిన న్యాయ సూత్రం. తెలంగాణ దశాబ్దాలుగా కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను కోల్పోయింది. కనుక సెక్షన్ 3 కింద విచారణ త్వరితగతిలో పూర్తి చేసి న్యాయమైన వాటా వచ్చే విధంగా చేయాలని ట్రిబ్యునల్ ను బీఆర్ఎస్ పక్షాన కోరుతున్నాం.సెక్షన్ 3 ప్రకారం కృష్ణా నదీజలాల కేటాయింపుల పై ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రకటించిన నేపథ్యంలో పటిష్టమైన వాదనలు వినిపించేలా నిష్ణాతులైన న్యాయవాదులను ఎంపిక చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీ ఆర్ ఎస్ పార్టీ తరపున సూచించారు. సెక్షన్ 3 ప్రకారం వాదనలు వినేందుకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు పాక్షిక విజయమే అని, తెలంగాణ కు కృష్ణా నదీ జలాల్లో న్యాయమైన వాటా దక్కితేనే అంతిమ విజయం సాధించినట్లవుతుందన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత జాగురకత తో అంతిమ ఫలితాన్ని రాబట్టేలా కృషి చేయాలని కోరారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత రైతుల పాలిట శాపం లా మారిందని, కాలువలు తవ్వితే రైతుల పొలాలకు నీలిచ్చే అవకాశమున్నా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును రేవంత్ ప్రభుత్వం పట్టించుకోక పోవడం దుర్మార్గం అన్నారు. కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డుకు ప్రాజెక్టులను అప్పజెబుతూ తీసుకున్న నిర్ణయాన్ని బీ ఆర్ ఎస్ ఒత్తిడి తెస్తే తప్ప మార్చుకోలేదని గుర్తు చేసారు. నీటి కేటాయింపుల కోసం కృషి చేస్తూనే ప్రాజెక్టుల సక్రమ నిర్వహణ అవసరం అని, యాసంగిలో తగిన నీటిని అందించాలని కోరారు. గత యాసంగిలో నీళ్లు లేక పంటలు ఎండిపోయిన పరిస్థితినే రేవంత్ ప్రభుత్వం పునరావృతం చేస్తే అది రైతాంగం పాలిట చేసిన ద్రోహం లాగానే భావించాల్సి ఉంటుందన్నారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా నీటి విడుదలకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతోందని రైతుల నుంచి మాకు పిర్యాదులు అందుతున్నాయని, ప్రాజెక్టుల కింద రైతులు వేసిన పంటలకు నీరివ్వాల్సిన భాద్యత సాగునీటి శాఖదేనని స్పష్టం చేసారు. యాసంగి సాగునీటి ప్రణాళిక లో అదనంగా మరిన్ని ఎకరాలను చేర్చాలని, గత సంవత్సరం యాసంగిలో పంటలు ఎండిపోయిన పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. తెలంగాణకు హక్కుగా రావాల్సిన నదీ జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృష్టి చేయాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, నీటి వాటా కోసం రాజీలేని పోరాటం చేయడానికి బీఆర్ఎస్ సిద్ధమని ప్రకటించారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేయాలి

**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 17 :** ప్రతి శాఖలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు సకాలంలో ఖర్చు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశంలో సమావేశం నిర్వహించారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం శాఖల వారీగా చేసిన ఖర్చు వివరాలను ప్రతి నెల రోజులకు ఒకసారి వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. ఉన్న నిధులను సంపూర్ణ స్థాయిలో వినియోగించాలని కోరారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం చేస్తున్న వ్యయం ఆయా వర్గాల్లో ఆదాయం బాగా పెరిగేలా, ఆస్తులు మరింత సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలతో ఈనెల 23న నిర్వహించబోయే సమావేశానికి రావాలని అధికారులను కోరారు. సబ్ ప్లాన్ చట్టం కోటా ప్రకారం ఇప్పటివరకు నిధులు ఖర్చు చేయని శాఖల అధికారులు రాబోయే రెండు నెలల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని ఆయా శాఖ అధికారులను ప్రశ్నించారు. బడ్జెట్ యేతర నిధులు ఖర్చు చేసే సమయంలో నుఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం జనాభా దామాషా లో నిధుల ఖర్చు జరిగిందా? లేదా? అందుకు సంబంధించిన సంపూర్ణ సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. అమలుకు సంబంధించి గత ఎనిమిది సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో వివిధ శాఖల్లో అధ్యయనం చేసిన సెస్ నివేదికను సమావేశాలు సంబంధిత అధికారులు ప్రదర్శించారు. సెస్ అధికారులు పరిశీలించిన అంశాలు, వారు పరిశీలించిన అంశాలపై అధికారులు సాధించిన ఫలితాలను డిప్యూటీ సీఎం ఆరా తీశారు. ఇకనుంచి సెస్ అధికారులు తమ నివేదికలను ఫైనాన్స్, ప్లానింగ్ శాఖ అధికారులకు అందజేసి వారితో తరచూ సమావేశం కావాలని సెస్ అధికారులను ఆదేశించారు.అటవీ భూముల్లో సోలార్ పవర్ ద్వారా మోటార్లు వినియోగించడం. ఆయా భూముల్లో వెదురు, అవకాడో, పామాయిల్ వంటి వాటితోపాటు అంతర పంటల సాగు ప్రాజెక్టులు డిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రయత్నం ద్వారా అడవులను సంరక్షించడంతోపాటు ఆదివాసి, గిరిజన రైతులకు ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. మూసి పునర్జీవనం కార్యక్రమంలో నిర్వాసితులవుతున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘ సభ్యులుగా చేర్పించి వారికి వడ్డీ లేని రుణాలు అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి పథకాలు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రవాణా వాహనాలు, క్లీనింగ్ యంత్రాలు ఆయా వర్గాలకు అందించాలని సూచించారు.ఇందిర జల ప్రభ, మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి ఎస్సీ, ఎస్టీ రైతులకు ఆర్థిక చేయూతను అందించాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేసేందుకు వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలతో ఎస్సీ, ఎస్టీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు సమావేశమై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, వికాస్ రాజ్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఎస్టి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పేస్ వాక్ చేసిన సునీతా విలియమ్స్..!

గత ఏడు మాసాలుగా అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌లో చిక్కుకుపోయిన ఇద్దరు వ్యోమగాముల్లో ఒకరైన సునీతా విలియమ్స్ తాజాగా గురువారం స్పేస్‌వాక్ చేశారు. ఈ స్పేస్‌వాక్ ఆమెకు ఎనిమిదోసారి కాగా, తాజాగా రోదసీ స్టేషన్‌కు వచ్చిన తర్వాత మొదటిది. 2012లో ఆమె చివరిసారిగా రోదసీలో నడిచారు. ప్రస్తుతం ఆమె రోదసీ స్టేషన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. నాసా వ్యోమగామి నిక్ హేగ్‌తో కలిసి ఆమె కొన్ని మరమ్మతులు చేయాల్సి వచ్చింది. దాంతో ఆమె బయటకు వచ్చారు. ఆ సమయంలో తుర్కెమినిస్తాన్ నుండి 420 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో తిరుగుతున్న రోదసీ స్టేషన్‌లోని ల్యాబ్ నుండి వారు బయటకు వచ్చారు. వచ్చే వారం ఆమె మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో కలిసి భూమికి తిరిగి వస్తారని భావిస్తున్నారు. వారం రోజుల పర్యటన కోసం వీరిద్దరు గత జూన్‌లో రోదసీకి వెళ్ళారు. అనుకోని సాంకేతిక సమస్యలు ఎదురవడంతో అక్కడే వుండిపోవాల్సి వచ్చింది.

## ఉగ్రవాద జాబితా నుండి క్యూబా తొలగింపు

వాషింగ్టన్: క్యూబాను ఉగ్రవాద దేశంగా ముద్ర వేసి ఆ దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా నాశనం చేయాలని చూసిన అమెరికా ఎట్టకేలకు ఒక అడుగు దిగొచ్చింది. అమెరికా ప్రవచిత ఉగ్రవాద జాబితా నుంచి క్యూబా పేరును తొలగించాలని అధ్యక్ష పదవి నుంచి వైదొలగుతున్న జో బైడెన్ నిర్ణయం తీసుకున్నారు. ఆంక్షలు మాత్రం యధావిధిగా కొనసాగించడం వల్ల ప్రయోజనం పరిమితమేనని క్యూబా విదేశాంగ మంత్రి రోడ్రిగ్యూ పరిల్లా వ్యాఖ్యానించారు. హెల్మ్స్-బర్టన్ చట్టం కింద దాఖలయ్యే పిటిషన్లకు వ్యతిరేకంగా అమెరికా న్యాయస్థానాల్లో ఎలాంటి చర్యలు తీసుకోకుండా నివారించేందుకు అధ్యక్షుని విశేషాధికాన్ని ఉపయోగించాలని కూడా నిర్ణయించింది. అమెరికా పౌరులు, సంస్థలతో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపకుండా ఆంక్షలు విధించిన క్యూబా సంస్థల జాబితాను రద్దు చేయాలని చెబుతోంది.. ఈ మేరకు వైట్‌హౌస్ ఈ నెల 14న ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ చర్యల వల్ల పరిమితమైన ప్రయోజనాలే వున్నప్పటికీ క్యూబా ప్రజలు, ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి లభించిన విజయంగా పేర్కొనవచ్చు. 2017 నుండి మరిన్ని ఆంక్షలను అమెరికా రుద్దింది. ఉగ్రవాద జాబితా నుంచి తొలగిస్తే చాలదు, ఆరు దశాబ్దాలకు పైగా అనుసరిస్తున్న ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని క్యూబన్లు, అమెరికాలో ఆ దేశ పౌరులు కోరుతున్నారు.

## ప్రతీ రైతుకు ఎకరాకు రేవంత్ ప్రభుత్వం 17,500 బాకీ ఉన్నది

ఓట్లేసిన ప్రజలు ఇప్పుడు రేవంత్ రెడ్డిని ఇష్టంవచ్చినట్టు తిడుతున్నరని చెప్పారు. రేవంత్ రెడ్డికి సిగ్గు,శరం లేవు కాబట్టి వాటిని పట్టించుకోకుండా ఇంకా పచ్చి అబద్దాలు చెప్పుకుంటూ తిరుగుతున్నారన్నారు. తాను ముఖ్యమంత్రి కాగానే 2 లక్షల రుణమాఫీ ఫైల్ మీద సంతకం పెడ్తా అన్న రేవంత్ రెడ్డి, తన సొంతూరు కొండారెడ్డి పల్లెలో అయినా, కొడంగల్ నియోజకవర్గంలో అయినా వందకు వంద శాతం రుణమాఫీ అయినట్టు నిరూపిస్తే తనతో పాటు రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో ఛాలెంజ్ చేస్తే రేవంత్ రెడ్డి సప్పుడు చేయలేదన్నారు కేటీఆర్. కేసీఆర్ గారు ఉన్నప్పుడు నాట్లప్పుడు పైసలు పడితే, ఇప్పుడు ఓట్లప్పుడు మాత్రమే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పైసలు ఇస్తుందన్నారు. మొన్న పార్లమెంట్ ఎన్నికలప్పుడు రైతు బంధు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్న కేటీఆర్, ఆ తరువాత నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. రైతుబంధు పది వేలు కాదు పదిహేను వేలు ఇస్తానని ఎన్నికల ప్రచారంలో హామి ఇచ్చిన రేవంత్ రెడ్డి, జనవరి 26 నుంచి 12 వేల రూపాయలు కాకుండా రైతుబంధు కింద 15 వేలు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇంతేకాదు 22 లక్షల మంది కౌలు రైతులకు కూడా రైతు బంధు ఇవ్వకుంటే వదిలిపెట్టే ప్రస్తకే లేదన్నారు. దాంతో పాటు వానకాలం నాటికి వేయాల్సిన రైతుబంధు పైసల్ని కూడా ప్రభుత్వం రైతులకు ఇవ్వాలన్నారు.అధికారంలోకి రాకముందు మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆ పని చేయాలన్నారు కేటీఆర్. రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఎకరానికి 17500 రూపాయలను రేవంత్ రెడ్డి బాకీ ఉన్నారని చెప్పారు. రేపు జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకుల గల్లా పట్టుకొని 17,500 రూపాయలు అడగాలని రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. అన్న వస్త్రం కోసం పోతే ఉన్నవస్త్రం పోతుందన్న కేసీఆర్ గారి మాటలు ఇవాళ నిజం అయ్యాయన్న కేటీఆర్, కాంగ్రెస్ అబద్ధపు హామీలను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. రాష్ట్రంలోని కోటి 60 లక్షల ఆడబిడ్డలకు రేవంత్ రెడ్డి నెలకు 2000 చొప్పున ఒక సంవత్సరంలో 30 వేల రూపాయలు బాకీ ఉన్నడని కేసీఆర్ అన్నారు. ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులు ముందుగా తమ 30 వేల రూపాయలు బాకీ తీర్చాలని ఆడబిడ్డలు అడగాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక తెలంగాణలో దాదాపు 5 లక్షల పెళ్లిల్లు అయినయన్న కేటీఆర్, ఆ ఆడబిడ్డలకు ఇవ్వడానికి రేవంత్ రెడ్డికి తులం బంగారం దొరకడం లేదా అని ప్రశ్నించారు. పెళ్లిళ్లు చేసుకున్న ఆ ఐదు లక్షల ఆడబిడ్డలకు రేవంత్ రెడ్డి తులం బంగారం అంటే దాదాపు 70 వేల రూపాయలు బాకీ ఉన్నడని చెప్పారు. రైతు భరోసా ఇవ్వనందుకు, రుణమాఫీ అని మోసం చేసినందుకు, 2500 అని ఆడబిడ్డలను మోసం చేసినందుకు, ఆరు గ్యారెంటీలను అమలు చేయనందుకు, భూములు ఇవ్వమన్న పాపానికి అన్యాయంగా లగచర్ల రైతులను జైల్లో వేసినందుకు, హీర్యా నాయక్ అనే రైతుకు గుండెపోటు వస్తే బేడీలు వేసి హాస్పటల్ తీసుకపోయినందుకు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ కు ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని రేవంత్ రెడ్డి నిలబెట్టుకునేవరకు బీఆర్ఎస్ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. కెసిఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తాను ఇచ్చినట్టు ఢిల్లీలో రేవంత్ రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్న కేటీఆర్, ఇచ్చిన మాట నిలబెట్టుకోకుంటే రాబోయే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వీపును తెలంగాణ ప్రజలు చింతపండు చేస్తరని కేటీఆర్ చెప్పారు. చేవెళ్లలో త్వరలో ఉప ఎన్నిక వస్తుందన్న కేటీఆర్, పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ త్వరలో ఎన్నికలు జరుగుతాయన్నారు. షాబాద్ రైతు దీక్ష ఆరంభం మాత్రమే అన్న కేటీఆర్, 21 తారీకు నాడు నల్లగొండలో రైతు ధర్నా ఆ తర్వాత అన్ని జిల్లాల్లోనూ రైతు దీక్షలు జరుపుతామన్నారు. ఎన్ని కేసులు పెట్టినా జైలుకు పంపిన రైతుల పక్షాన కొట్లాడుతూనే ఉంటామని తేల్చి చెప్పారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన బిఆర్ఎస్ నాయకులు రైతు దీక్షను బ్రహ్మాండంగా జరిపినందుకు స్థానికి బీఆర్ఎస్ నాయకులను కేటీఆర్ అభినందించారు.

## పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు మరొక ఎదురుదెబ్బ

### ➩అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్యకు 14 ఏళ్ళ జైలు శిక్ష

**ఇస్లామాబాద్ (మన వెలుగు) జనవరి 17 :** పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు మరొక ఎదురుదెబ్బ తగిలింది. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు, ఆయన భార్య బుష్రా బీబీలను అవినీతి నిరోధక కోర్టు దోషులుగా నిర్ధారించింది. ఈ కేసులో



ఇమ్రాన్‌కు 14 సంవత్సరాల జైలు శిక్షను, బుష్రాకు ఏడు సంవత్సరాల జైలు శిక్షను కోర్టు విధించింది. ఇమ్రాన్‌కు పది లక్షలు, బుష్రాకు 5 లక్షల పాకిస్తానీ రూపాయల జరిమానాను కోర్టు విధించింది. అడియాలా జైలులో కట్టుదిట్టమైన భద్రత మధ్య న్యాయమూర్తి నసీర్ జావేద్ రాణా తుది తీర్పు చదివి వినిపించారు. అల్ ఖాదిర్ ట్రస్ట్ కేసు వివరాలలోకి వెళితే, లండన్‌లో ఉంటున్న పాకిస్తాన్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుస్సేన్ నుంచి వసూలు చేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్ ప్రభుత్వం పాకిస్తాన్‌కు పంపగా, ఆ సొమ్మును ఇమ్రాన్ ఖాన్ దంపతులు గోల్‌మాల్ చేశారని వారిపై ఉన్న ఆరోపణ. ఆ సొమ్మును జాతీయ ఖజానాలో జమ చేయకుండా సుప్రీం కోర్టు అంతకు ముందు రియాజ్ హుస్సేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదు నుంచి కట్టారనేది వారిపై ఉన్న అభియోగం.దీనికి బదులుగా ఇమ్రాన్ దంపతులు నెలకొల్పబోతున్న అల్ ఖాదిర్ విశ్వవిద్యాలయానికి 57 ఎకరాలను రియాజ్ హుస్సేన్ ఇచ్చినట్లు చెబుతున్నారు. జాతీయ ఖజానాకు 19 కోట్ల పౌండ్ల మేరకు నష్టం కలిగించారని ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీ, మరి ఆరుగురిపై ఆరోపణలతో జాతీయ జవాబుదారీ మండలి (ఎన్ఎబి) 2023 డిసెంబర్‌లో కేసు దాఖలు చేసింది. అయితే, ఇమ్రాన్, బుష్రాపై మాత్రమే ప్రాసిక్యూషన నడిచింది. స్థిరాస్తి వ్యాపారి సహా ఇతర నిందితులు అందరూ పాకిస్తాన్ వెలుపల ఉన్నారు. ఇమ్రాన్ ఖాన్‌పై ఇప్పటి వరకు 200 పైచిలుకు కేసులు ఉన్నాయి. ఇమ్రాన్ 2023 ఆగస్టు నుంచి జైలు జీవితం గడుపుతున్నారు.

## నాథన్ అండర్సన్ సంచలన నిర్ణయం

అదానీ గ్రూపు అక్రమాలు, డొల్ల కంపెనీలపై సంచలన రిపోర్ట్‌ను విడుదల చేసిన అమెరికన్ షార్ట్ సెల్లర్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. తమ సంస్థ కార్యకలాపాలను మూసివేస్తున్నట్లు హిండెన్‌బర్గ్ వ్యవస్థాపకుడు నాథన్ అండర్సన్ ఒక లేఖలో స్పష్టం చేశారు. దీనిని కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. ”గతేడాది నుంచి నేను నా కుటుంబం, స్నేహితులు, మా బృందంతో చర్చించి, హిండెన్ బర్గ్ రీసెర్చ్ కార్యకలాపాలు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నాను. మేము చేస్తోన్న పనులకు సంబంధించిన ఐడియాలు, లక్ష్యం పూర్తి కావటంతో ఈ నిర్ణయానికొచ్చాం. దీని వెనక ఎలాంటి బెదిరింపులు, ఆరోగ్య కారణాలు, వ్యక్తిగత అంశాలు లేవు” అని అండర్సన్ వివరించారు. తన బృందం మంచి స్థాయికి చేరుకునేందుకు సాయపడతానన్న ఆయన.. ఇక తన భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి పెడతానని చెప్పారు. హిండెన్‌బర్గ్ సంస్థను 2017లో పది మంది ఉద్యోగులతో అండర్సన్ ప్రారంభించారు. అమెరికాలోని న్యూయార్క్ కేంద్రంగా ఇది పని చేస్తోంది. ఆర్థిక రంగంలో మానవ నిర్మిత కృత్రిమ విపత్తులను గుర్తిస్తామని తెలిపింది. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ కంపెనీలలో జరిగే అవకతవకలు, మోసాలను గుర్తించటం, పెట్టుబడులు, రుణాలు, డెరివేటీవ్‌లను విశ్లేషించటం పనిగా పెట్టుకుంది. ఈ కంపెనీ షార్ట్ సెల్లింగ్‌లలోనూ పెట్టుబడులు పెడుతుంది. ఈ సంస్థ విడుదల చేసిన నివేదికలు భారత్, యూరోపియన్ దేశాల్లో, ఇతర ప్రపంచ స్టాక్ మార్కెట్‌లోనూ సంచలనంగా మారింది. హిండెన్‌బర్గ్ సంస్థకు 60కి పైగా దేశాల్లో నెట్‌వర్క్ ఉంది. ఈ దేశాల్లోని మాజీ టాప్ బ్యూరోక్రాట్లు, కార్పొరేట్ కంపెనీ ఉద్యోగులు, ఆర్థిక సంస్థలతో హిండెన్‌బర్గ్‌కు మంచి సంబంధాలున్నాయి. కంపెనీల్లో జరిగే ఆర్థిక అవకతవకలను గుర్తించటంలో అండర్సన్‌కు మంచి పట్టు ఉంది. కార్పొరేట్ ప్రపంచంలో అతిపెద్ద కుంభకోణంగా చెప్పుకొనే బెర్నీ మడాఫ్ మోసపూరిత లావాదేవీల గుట్టును విప్పిన వారిలో ఒకరైన హరీ మార్కోపోలోస్‌తో కలిసి అండర్సన్ ప్లాటినం పార్ట్‌నర్స్ అనే సంస్థపై దర్యాప్తు కోసం కలిసి పని చేశారు. ఇదే సమయంలో షార్ట్ సెల్లింగ్, పెట్టుబడులు, రుణాలు, డెరివేటీవ్‌లను విశ్లేషించడం, ఆర్థిక మోసాల గురించి లోతుగా అధ్యయనం చేశాడు. ఆ తర్వాతే హిండెన్‌బర్గ్ కంపెనీని ఏర్పాటు చేశాడు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# 19 నుండి గాజాలో కాల్పుల విరమణ
## అంగీకరించిన ఇజ్రాయిల్, హమాస్

**జెరూసలెం :** గాజాలో ఇజ్రాయిల్ సైనిక బలగాలు గత 15మాసాలకు పైగా కొనసాగిస్తున్న భీకర దాడులకు విరామం ఇస్తూ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన దేశాల్లో ఒకటైన కతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ గురువారం ప్రకటించారు. ఈ కాల్పుల విరమణ ఆదివారం (19వ తేదీ) నుండి అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. బందీలు, ఖైదీల విడుదల ప్రక్రియ కూడా అప్పుడే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కాల్పుల విరమణ శాశ్వతంగా అమలు కావాలన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. కతార్ రాజధాని దోహాలో గత కొన్ని వారాలుగా అనేక అడ్డంకుల మధ్య కొనసాగుతూ వచ్చిన ఈ చర్చల్లో ఎట్టకేలకు ఈ ఒప్పందం కుదిరింది. హమాస్ చెరలో వున్న బందీలను దశలవారీగా విడుదల చేసేందుకు, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్ళలో మగ్గుతున్న వందలాదిమంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు ఈ ఒప్పందం హామీ కల్పించింది. అలాగే వరుసగా కొనసాగిన దాడులతో ఇళ్లు, వాకిళ్లు వీడి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వేలాదిమంది పాలస్తీనియన్లను తిరిగి వారి స్వస్థలాలకు చేరేందుకు కూడా ఈ ఒప్పందం అనుమతిస్తోంది. విచక్షణారహితంగా జరిగిన దాడులతో పూర్తిగా వినాశనం చోటు చేసుకున్న గాజాకు ఎంతగానో అవసరమైన మానవతా సాయాన్ని అందించేందుకు కూడా ఈ ఒప్పందం వీలు కల్పిస్తోంది. ఒప్పందంలోని కొన్ని అంశాలపై ఇజ్రాయిల్ పాలక సంకీర్ణంలో చివరి నిముషంలో కొన్ని విభేదాలు తలెత్తినప్పటికీ చివరకు ఈ ఒప్పందానికి ఇజ్రాయిల్ కేబినెట్ కూడా అనుకూలంగా ఓటు వేసింది. తాము కూడా పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కట్టుబడి వున్నామని హమాస్ సీనియర్ అధికారి ప్రకటించారు. హమాస్ విధించిన షరతులన్నీ నెరవేరేలానే ఈ ఒప్పందం కుదిరిందని ఇజ్జాత్ అల్ రిషిక్ చెప్పారు. ఇజ్రాయిల్ బలగాలు గాజా నుండి పూర్తిగా వైదొలగాలని, నిర్వాసితులందరూ వెనక్కి తిరిగి వచ్చేందుకు అనుమతించాలని హమాస్ కోరుతూ వస్తోంది. అలాగే ఈ ఒప్పందం శాశ్వత కాల్పుల విరమణకు దారి తీయాలని వాంఛిస్తోంది. ఇప్పటివరకు గాజా దాడుల్లో 46,788మంది మరణించారు. 1,10,453మంది గాయపడ్డారు.

## జ్యుడిషియల్ కమిషన్లు ఏర్పాటు చేయాల్సిందే



**ఇస్లామాబాద్:** ప్రభుత్వంతో మూడో రౌండ్ చర్చల కోసం పాకిస్తాన్ తెహ్రీక్- ఎ- ఇన్సాఫ్ (పిటిఐ) డిమాండ చార్టర్‌నొకదా నిని సమర్పించింది. తాము గుర్తించిన రాజకీయ ఖైదీలను విడుదల జేయాలని, మే9 నాటి హింసాత్మక ఘటనలపై రెండు జ్యుడిషియల్ కమిషన్లు వేయాలని, ఇందులో పాకిస్తాన్ చీఫ్ జస్టిస్, లేదా ముగ్గురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, పిటిఐ, ప్రభుత్వ ప్రతినిధులు ఉండేలా చూడాలని గురువారం లిఖితపూర్వకంగా సమర్పించిన మూడు పేజీల డిమాండ్ల పత్రంలో పేర్కొన్నారు. ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్‌తో రెండు రోజుల క్రితం పెషావర్‌లో సమావేశమైన పిటిఐ చైర్మన్, బారిస్టర్ గౌహర్ అలీఖాన్ గురువారం అడియాలా జైలులో ఉన్న తమ పార్టీ నేత ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకుని చర్చల వివరాలను ఆయనకు నివేదించారు. జ్యుడిషియల్ కమిషన్లను వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని, లేకుంటే చర్చలకు దూరంగా ఉంటామని పిటిఐ చైర్మన్ హెచ్చరించారు. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను విడుదలజేయాలని కోరుతూ నవంబరులో దేశవ్యాపితంగా నిరసన ర్యాలీలు హోరెత్తడంతో రాజకీయ ఉద్రిక్తతలను తగ్గించడం కోసం ప్రభుత్వం, సైన్యం ఒక మెట్టు దిగొచ్చి పిటిఐ నేతలతో చర్చలకు సిద్ధమైంది.

## 25, 26 తేదీల్లో ఇండోనేషియా అధ్యక్షులు పర్యటన

**న్యూఢిల్లీ :** ఈ నెల 25, 26 తేదీల్లో ఇండోనేషియా అధ్యక్షులు ప్రబోవా సుబియాంటో దేశంలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు 76వ రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న ఆయన రెండు రోజులు దేశంలోనే ఉంటారు. 2024 అక్టోబర్‌లో ప్రబోవా సుబియాంటో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. భారత్‌లో ఆయన అడుగుపెట్టడం ఇదే తొలిసారి అని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు దోహదపడుతుందని తెలిపింది. ప్రాంతీయ, ప్రపంచ సమస్యలను చర్చించడానికి అవకాశాన్ని కల్పిస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. సుబియాంటో 2020లో ఇండోనేషియా రక్షణ మంత్రిగా న్యూఢిల్లీని సందర్శి ంచారు. 1950 నుంచి భారత్ తన మిత్ర దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అథితులు లేకుండా రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించారు. 2024లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, 2023లో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా ఎస్-సిసి ముఖ్య అతిథిగా వచ్చారు. 2021, 2022 సంవత్సరాల్లో కరోనా కారణంగా గణతంత్ర దినోత్సవ వేడుకలకు అతిథులను ఆహ్వానించలేదు.



## కొద్దిమంది చేతుల్లో సంపద ప్రజాస్వామ్యానికే ప్రమాదం

**వాషింగ్టన్ :** దేశంలో వేళ్లూను కుంటున్న నయా సంపన్నులనబడే పెద్ద మనుషుల వల్ల ఎదురయ్యే ప్రమాదం గురించి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హెచ్చరించారు. అమెరికన్ల హక్కులు, ప్రజాస్వామ్య భవిష్యత్తును దెబ్బతీస్తున్న 'టెక్ - ఇండిస్టియల్ కాంప్లెక్స్' గురించి కూడా ఆయన హెచ్చరించారు. ఓవల్ ఆఫీస్ నుండి దేశ ప్రజలనుద్దేశించి బుధవారం బైడెన్ 15నిముషాల పాటు వీడ్కోలు ప్రసంగం చేశారు. అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్‌కు ఈ నెల 20న బైడెన్ అధికారాన్ని అప్పగించాల్సి వుంది. అమెరికాలో అధికారం, సంపద అంతా కేవలం కొద్దిమంది చేతుల్లో పేరుకుపోయి వుంటోందనే విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. "ఈనాడు, అమెరికాలో అత్యంత సంపద, అధికారం, ప్రాబల్యం వంటి వాటితో కూడిన సామ్రాజ్యవాదం రూపుదిద్దుకుంటోంది. ఇది మొత్తంగా మన ప్రజా స్వామ్యం, మౌలిక హక్కులు, స్వేచ్ఛలకు ముప్పుగా పరిణమిస్తుంది. ముందుకెళ్లడానికి ప్రతి ఒక్కరికీ గల అవకాశాలను దెబ్బ తీస్తుంది." అని బైడెన్ పేర్కొన్నారు. కొద్ది మంది నయా సంపన్నుల చేతుల్లో ఇలా అధికారం కేంద్రీకృతమవడం వల్ల ఎదురయ్యే తీవ్ర పర్యవసానాల గురించి బైడెన్ హెచ్చరించారు. వారి అధికార దుర్వినియోగాన్ని ఎలాంటి అడ్డూ అదుపు లేకుండా వదిలివేసినట్లైతే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. 1961లో అధికారం నుండి వైదొలగిన అధ్యక్షుడు ఐషన్‌హోవర్ ఆనాడు మిలటరీ , ఇండిస్టియల్ కాంప్లెక్స్ చేసిన హెచ్చరికలను ఈ సందర్భంగా ఉటంకించారు. అధికార బదిలీ ప్రక్రియ అంతా శాంతియుతంగా , సాఫీగా సాగిపోతుందంటూ ట్రంప్‌నుద్దేశించి అన్యా పదేశంగా పేర్కొన్నారు. ఇప్పటివరకు తాము చేపట్టిన చర్యల ఫలితాలు అందుకోవడానికి కొంత సమయం పడుతుందని, రాబోయే దశాబ్దాల్లో అవి ప్రతిఫలి స్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. అధ్యక్ష పదవికి ముగింపుగా కాకుండా ఐదు దశాబ్దాల రాజకీయ జీవితానికి ముగింపుగా బుధవారం బైడెన్ చేసిన ప్రసంగాన్ని చూడాల్సి వుంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.



## స్పేడెక్స్ అనుసంధానం విజయవంతం




**న్యూఢిల్లీ :** స్పేడెక్స్ డాకింగ్ ప్రయోగం విజయవంతమైనట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రకటించింది. అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ చారిత్రాత్మక ప్రయోగాన్ని చేపట్టిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. డిసెంబర్ 30న పిఎస్‌ఎల్‌వి సి60 ద్వారా ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు ఎస్‌డిఎక్స్ 01 (ఛేజర్), ఎస్‌డిఎక్స్ 02 (టార్గెట్)లను ఇస్రో టెలీమెట్రీలోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ (ఎంఒఎక్స్) నుండి అంతరిక్షంలోకి అనుసంధానం చేసినట్లు ఇస్రో ప్రకటించింది. క్లిష్టతరమైన డాకింగ్ విధానాన్ని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ (ఐఎస్‌టిఆర్‌ఎసి) పర్యవేక్షించిందని తెలిపింది. అంతరిక్ష నౌక డాకింగ్ పూర్తయిందని, ఇదో చారిత్రాత్మక క్షణమని ఇస్రో సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొంది. చంద్రునిపైకి భారతీయ వ్యోమగామిని పంపడం, చంద్రుని నుండి నమూనాలను భూమిపైకి తీసుకురావడం, భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్వహణకు ఈ సాంకేతికత అవసరమని తెలిపింది.

## ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశమైంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం జనవరి 2016లో అమలులోకి తీసుకొచ్చిన 7వ వేతన సంఘం సిఫార్సులు ఈ ఏడాది డిసెంబర్ 31తో ముగియనున్నాయి. ఎనిమిదో వేతన సంఘం సిఫారసులు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి రావాల్సి ఉంది. వేతన సంఘం సిఫారసుల మేరకు ఉద్యోగులకు వేతనాలు పెరగాల్సి ఉంది. వేతనం సంఘం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిన నేపథ్యంలో త్వరలోనే కమిషన్ ఛైర్మన్‌తోపాటు ఇద్దరు సభ్యులను నియమించనున్నది. ఉద్యోగులు, పెన్షనర్లు, ట్రేడ్ యూనియన్లు కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో వేతన సంఘం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. వచ్చే నెల ఒకటో తారీఖున కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్ర కేబినెట్ సమావేశమైన పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.3,985 కోట్ల వ్యయంతో శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు అలాగే రోదసిలోకి మానవుడిని పంపే ప్రాజెక్టుకూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఎన్‌జిఎల్‌వి రాకెట్లు భారీ శాటిలైట్లను కక్ష్యలోకి మోసుకెళ్లగల సామర్థ్యం కలిగివున్నాయని ఆయన తెలిపారు.




## ఎంపిల ఇళ్లు, కార్యాలయాల వద్ద 20న ఆందోళన

**న్యూఢిల్లీ :** ఈ నెల 20న ఎంపిల ఇళ్లు, కార్యాలయాల వద్ద ఆందోళనకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. ఈ నెల 26న జిల్లాలు, సబ్ డివిజన్లలో జరిగే ట్రాక్టర్, వాహనం, మోటార్ సైకిల్ మార్చ్‌లు నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు గురువారం ఎస్‌కెఎం ప్రకటన విడుదల చేసింది. వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదా (ఎన్‌పిఎఫ్‌ఎఎం)ను తిరస్కరిస్తూ రాష్ట్రాల అసెంబ్లీల్లో తీర్మానాన్ని ఆమోదించాలని, రైతు సంఘాల చర్చలు జరపడానికి, దల్లేవాల్ ప్రాణాలను కాపాడటానికి ప్రధానమంత్రికి లేఖ రాయాలని ముఖ్యమంత్రులను ఎస్‌కెఎం నేతలు కోరుతున్నారు. ఖానౌరి సరిహద్దులో జగ్జిత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరాహార దీక్ష 52 రోజులు దాటిన నేపథ్యంలో ఎంఎస్‌పి, రుణమాఫీ, జగ్జిత్ సింగ్ దల్లెవాల్ ప్రాణాలను కాపాడటం, వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను వెంటనే ఉపసంహరించుకోవాలనే డిమాండ్లతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఎస్‌కెఎం పోరాడుతోందని పేర్కొన్నారు. 52 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న దల్లేవాల్ ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఉందని ప్రధానమంత్రికి లేఖ రాయాలని ఎస్‌కెఎం సమన్వయ కమిటీ నిర్ణయించింది. అన్ని రాష్ట్రాల్లో కిసాన్ మహాపంచాయత్ నిర్వహించాలని, ఫిబ్రవరి 11న బీహార్‌లోని పాట్నాలో భారీ కిసాన్ మహాపంచాయత్ జరగనుందని తెలిపింది. రైతు వ్యతిరేక, సమాఖ్య వ్యతిరేక వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదా (ఎన్‌పిఎఫ్‌ఎఎం) తిరస్కరించడానికి అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించాలని, దానిని తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని ఎస్‌కెఎం ప్రతినిధులు సంబంధిత ముఖ్యమంత్రులను కలవనున్నారు. రైతు సంఘాలతో వెంటనే చర్చలు నిర్వహించి దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని ప్రధానమంత్రికి లేఖ రాయాలని కోరనున్నారు.



## ప్రార్థనా స్థలాల చట్టాన్ని నీరుగార్చుతున్నారు

**న్యూఢిల్లీ :** ప్రార్థనా స్థలాల చట్టాన్ని పరిరక్షించేందుకు న్యాయవ్యవస్థ తక్షణమే జోక్యం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గురువారం సుప్రీం కోర్టును అభ్యర్థించింది. జాతీయవాదం, స్వాతంత్ర్యోద్యమంలో భాగంగానే భారతదేశంలో లౌకికవాదం అభివృద్ధి చెందిందని ఈ సందర్భంగా పార్టీ వ్యాఖ్యానించింది. భారత ప్రజల ఆదేశాన్ని ఈ చట్టం ప్రతిబింబిస్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ అన్నారు. భారత్‌కు స్వాతంత్ర్యం లభించినపుడు 1947 ఆగస్టు 15నాటికి నెలకొని వున్న ఆరాధనా స్థలాల స్వభావాన్ని ఈ చట్టం పరిరక్షిస్తోంది. 10వ లోక్‌సభలో ఈ చట్టాన్ని ఆమోదించారు. దేశంలో లౌకికవాదాన్ని పరిరక్షించేందుకు ఈ చట్టం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్ళను చూస్తుంటే ఇప్పటికే వేళ్లూనుకుపోయిన లౌకికవాద సిద్ధాంతాలను దెబ్బతీసేలా దురుద్దేశపూరితమైన ప్రయత్నాలు జరుగుతున్నట్లు కనిపిస్తోందని పార్టీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ చట్టం యొక్క రాజ్యాంగబద్ధమైన, సామాజికపరమైన ప్రాధాన్యతను నొక్కి చెప్పడానికి గానూ ఈ విషయంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని పార్టీ కోరుతోందని వేణుగోపాల్ పేర్కొన్నారు.



మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# పత్తి చెనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జనవరి 17 :** ములుగు జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం తప్పింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి వద్ద ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులకు స్వల్పంగా గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. హనుమకొండ నుండి మంగపేటకు వెళ్తున్న క్రమంలో బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడు స్టీరింగ్ సమస్య తలెత్తిందని, దాంతో బస్సు పొలాల్లోకి దూసుకెళ్లిందని డ్రైవర్ తెలిపారు.



పత్తి చెనులోకి దూసుకెళ్లిన బస్

# రోడ్డు భద్రత పోస్టర్లను విడుదల చేసిన రాష్ట్ర మంత్రి

**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 17 :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు సంక్షేమ పథకాల అమ్ములు జరుగుతున్న సర్వేది రూపాయలు ప్రత్యేక సమీక్ష వేషం సమావేశం నిర్వహించేందుకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్కు విచ్చేసిన రాష్ట్ర మంత్రి సీతక్క రోడ్డు భద్రత పోస్టులను విడుదల చేశారు రోడ్డు భద్రత పట్ల ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు ఎమ్మెల్సీ దండెవిట్టల్, ఎమ్మెల్యే అనిల్ యాదవ్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ డా , జానకి షర్మిల తదితరులు పాల్గొన్నారు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

# ఫ్యాబ్రికేషన్ కార్మికులకు రెండు నెలల వేతనం అందజేత

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జనవరి 17 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం ఇండస్ట్రీ ఏరియాలో భాష్ ఖాన్ ఫ్యాబ్రికేషన్ లో ప్రవీణ్, మున్న, ఇద్దరు కార్మికులు ఫ్యాబ్రికేషన్ షాప్ లో గత కొన్ని సంవత్సరల నుంచి ఫ్యాబ్రికేషన్ ఓనర్ భాష దగ్గర చేసేవారు కొన్ని అనివార్య కారణాలవల్ల రెండు నెలల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో ఫ్యాబ్రికేషన్ వర్క్ మానేయడం జరిగింది... మొత్తం జూన్, జూలై, రెండు నెలల వేతనం 60,000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు ఫ్యాబ్రికేషన్ ఓనర్ ఎండి. భాషను ఇంత అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు ప్రవీణ్, మున్న తమకు తెలిసిన తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు...వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్.. హుటాహుటిన ఫ్యాబ్రికేషన్ షాప్ దగ్గరికి వెళ్లి ఓనర్ ఎండి.భాష తో పలుమార్లు చర్చించి కార్మికులు ఇద్దరికీ కలిపి మొత్తం రావాల్సిన వేతనం జూన్, జూలై రెండు నెలల వేతనం, 60,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది.ఫ్యాబ్రికేషన్ కార్మికులు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు, తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..



వేతనం అందిస్తున్న దృశ్యం

# మన వెలుగు క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్ఐ

**మద్దూరు (మన వెలుగు) జనవరి 17 :** మద్దూరు పట్టణ కేంద్రంలో శుక్రవారం రోజు మన వెలుగు క్యాలెండర్ ఆవిష్కరించిన ఎస్సై రామ్ లాల్.ఈ సందర్భంగా ఎస్సై రామ్ లాల్ మాట్లాడుతూ మన వెలుగు దినపత్రిక ప్రజల సమస్యలపై ప్రతినిత్యం పోరాటం చేసి వార్త రూపంలో ప్రభుత్వ ఉద్యోగ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ బృందం మరియు మన వెలుగు దినపత్రిక రిపోర్టర్ విష్ణు,సహచర జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

# మూడు ముక్కలుగా ఉన్న జంగాలపల్లి క్రాస్ రోడ్ ఒకటిగా చేయండి

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జనవరి 17 :** ములుగు జిల్లా ములుగు మండలంలోని జంగాలపల్లి క్రాస్ రోడ్డు ను మూడు ముక్కలుగా చేసి అక్కడి ప్రజలకు పరిపాలన సౌలభ్యం లేకుండా చేసి ఇబ్బంది పెడుతున్నారు గత ప్రభుత్వం ఉన్నప్పుడు బంజేరి పల్లెను గ్రామపంచా యతీ చేసే తరుణంలో క్రాస్ రోడ్డు కలుపుకొని గెజిట్లో నమోదు కాగా ఇక్కడున్న కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిడితో గత ప్రభుత్వ పాలకులు రాత్రికి రాత్రి గెజిట్లో ఉన్న క్రాస్ రోడ్ ను తొలగించి మ్యాపులో లేని కొత్త గడ్డను నమోదు చేసుకొని బంజరు పల్లెను గ్రామపం చాయతీ చేసి క్రాస్ రోడ్డుకు అన్యాయం చేయడం జరిగింది ఎందుకంటే జంగాలపల్లి క్రాస్ రోడ్ పరిధిలో అంగడి ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని జంగాలపల్లి ఇంచర్ల. బంజరు పల్లె. గ్రామాల నాయకులు. క్రాస్ రోడ్ ను ప్రత్యేక గ్రామపంచా యతీ చేస్తే వారికి వచ్చే ఆదాయానికి గండి పడుతుందని ఆలోచనలో క్రాస్ రోడ్ గ్రామపంచాయతీ కావడానికి అడ్డుపడుతున్నారు.ఈ యొక్క విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి గ్రామ ప్రజలు తీసుకపోగా గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాలేదని చెప్పారు కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న గ్రామపంచాయతీలలో మీకు న్యాయం చేస్తామని చెప్పారు కానీ ములుగు జిల్లాలో కొత్తగా గ్రామపంచాయతీ చేస్తు న్నట్లు ప్రకటించగా అందులో ములుగు మండలంలో నాలు గు కొత్త గ్రామపంచాయతీలను ప్రకటించారు చింతకుంట చిన్న గుంటూరు పల్లె జగ్గన్నగూడెం శ్రీరాములపల్లి గ్రామపంచాయతీలుగా చేయగా మూడు ముక్కలుగా ఉన్న మూడు గ్రామ పంచాయతీ పాలిస్తున్న క్రాస్ రోడ్ల మాత్రం గ్రామపంచాయతీ చేయకపోవడంతో ఇక్కడున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దీనిని గమనించి స్థానిక మంత్రి పంచాయతీ రాజ్ శిశు సంక్షేమ గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క జంగాలపల్లి క్రాస్ రోడ్డును. గ్రామపం చాయతీ గా చేసి మాకు న్యాయం చేయాలని కోరుతున్నా రు.ఈ కార్యక్రమంలో సామల రమేష్ వీర గొని భాస్కర్ గుండేటి అనిల్ సిరికొండ రమేష్ నాగపురి హరి గౌడ్,గని శెట్టి రాజు దిగువ రాజమల్లు. గట్టు యాదగిరి బొమ్మగాని రాజు భూరం.చేరాలు తదితరులు పాల్గొన్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

# క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం ఎమ్మెల్యే

**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు ) జనవరి 17 :** సారంగాపూర్ ఆలయ కమిటీ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం అని ఎంఎల్ఏ మహేశ్వర్ రెడ్డి అన్నారు మండలంలోని పొట్య గ్రామపంచాయతీ పరిధిలోని బండ రేవు తండా లోని నాను మహారాజ్ 32 వ.జాతారోత్సవానికి నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హాజరైనారు. మహారాజ్, జగదంబ దేవి ఆలయలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ నిర్వాహకులు ఎంఎల్ఏ మహేశ్వర్ రెడ్డి ని శాలువా పూలమాలలతో సత్కరించారు అనంతరం ఆటల పోటీలు ప్రారంభించారు గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేసి మాట్లాడారు..ఆలయ నిర్వాహకులు జాతర సమయంలో కబడ్డీ,వాలీబాల్,క్రికెట్,కుస్తీ వంటి వివిధ క్రీడల నిర్వహణను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు క్రీడలతో మానసిక ఆనందం తోపాటు క్రీడాకారులకు ఉపాధి ఉద్యోగాలు సైతం లభిస్తాయని అన్నారు. గత కొన్ని సంవ్సరాలుగా ఆలయ కమిటీ క్రీడలను నిర్వహించడాన్ని అభినందించారు .అనంతరం జాతర నిర్వహణకు రూ.32 వేలు కమిటీ సభ్యులకు అందజే శారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రామ్ నాథ్,నాయకులు మెడిసెమ్మ రాజు, విలాస్,రామ్ శంకర్ రెడ్డి, గంగారెడ్డి,కె.రాజేశ్వర్ రెడ్డి, కరుణా సాగర్ రెడ్డి,పోతన్న,వీరయ్య,ఎల్లన్న,నరేష్,విజయ్, దావూజి నాయక్,నారాయణ నాయకు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆటలపోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

# రాజకీయాలకు అతీతంగా లబ్దిదారులను గుర్తించండి

- ▷ భైంసాలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇవ్వండి
- ▷ అర్హులందరికీ రేషన్ కార్డు ఇవ్వాలి

**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 17 :** పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో ఎలాంటి రాజకీయాలు ఉండకూడదని, రాజకీయాలకి అతీతంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక, రేషన్ కార్డుల ప్రక్రియ, చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక సమీక్ష సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క అధ్యక్షతన సమావేశం కాగా, ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొనడంతో సమీక్షా సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. భైంసాలో అప్పటి ప్రభుత్వ హాయంలో డబుల్ బెడ్ రూమ్ లు నిర్మించారని, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, రహదారి వ్యవస్థ కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలన్నారు. లబ్ధిదారులను గుర్తించినప్పటికీ ఇప్పటివరకు అధికారులు సర్టిఫికెట్లు అందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. లబ్ధిదారుల ధ్రువపత్రాలు అందించడానికి జాప్యం ఎందుకు అవుతుందని అన్నారు. భైంసా తో పాటు, పలు గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ల పరిస్థితి ఇదే విధంగా ఉందన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కావడం లేదన్నారు. అదేవిధంగా 10 సంవత్సరాల కాలంగా గ్రామాల్లో పేదలకు ఇండ్లు లేక పరితపించారని, ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక జరుగుతున్న తరుణంలో అసలైన పేదవారిని గుర్తించి , వారికి ఇండ్ల మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలు ఉండకూడదన్నారు. అదేవిధంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల ఎంపిక ప్రక్రియ ప్రభుత్వం ప్రారంభిస్తామనడం మంచి పరిణామమని, అయితే ఇందులో అర్హులను గుర్తించి, పేదలకు న్యాయం చేయాలన్నారు. ముధోల్ నియోజక వర్గంలో పలు గ్రామాల్లో యువకులు, పలువురు ఉపాధి కోసం ఇతర దేశాలకు వలస వెళ్లారని వాళ్ళు లేకున్నా, రేషన్ కార్డులో వారి పేరు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 10 సంవత్సరాల కాలంగా రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఎన్నో కుటుంబాలు కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయని, సర్వే పకడ్బందీగా నిర్వహించి అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం పలు కార్యక్రమాలపై సమీక్ష జరగగా, ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మంత్రి సమక్షంలో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

# ముఖ్యమంత్రి సహాయనిది చెక్కుల పంపిణీ

**కూకట్పల్లి (మన వెలుగు) జనవరి 17 :** కూకట్పల్లి నియోజకవర్గం లోని ఫతేనగర్(118) కి చెందిన జేన జలంధర్ 60,000/- రూపాయల చెక్ అల్లాపూర్(116) కి చెందిన చెరుకూరి తేజేశ్వరరావు కి 60,000/- రూపాయల చెక్కులు మంజూరైనవి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి ధరకాస్తూ చేసుకోగ 1,20,000/ రూపాయలు మంజురు అయినవి. అట్టి చెక్కులను బండిరమేష్ చేతులమీదుగా బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు మోయిజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

# ఉరి వేసుకుని దంపతుల ఆత్మహత్య

**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 17 :** నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండలం కాల్వ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పరిసరాలలో ఉన్న అడవి ప్రాంతంలో భార్యాభర్తలిద్దరూ ఒకే చెట్టు కొమ్మకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసు కుంది సమాచారం అందుకున్న దిలావర్పూర్ ఎస్సై సందీప్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని శవాల పంచనామ నిర్వహిస్తూన్నారు . మృతులిద్దరూ సారంగాపూర్ మండలం స్థానికులు చించోలి బి గ్రామస్తులుగా స్థానికులు ఇచ్చిన ప్రాథమిక సమాచారం



ఉరివేసుకున్న దంపతులు

# భక్తులతో కిటకిటలాడిన బాసర పుణ్యక్షేత్రం

**బాసర (మన వెలుగు) జనవరి 17 :** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో బారులు తీరిన భక్తులు.శుక్రవారం శుభ ముహూర్తం కావడంతో గోదావరి నదిలో స్నానమాచరించి అమ్మవారిని దర్శించు కుని మొక్కులు తీర్చుకున్నారు.తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్ర రాష్ట్రాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుండి భారీగా భక్తులు తరలి వచ్చారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది, అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు.అమ్మవారి దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం పట్టింది.



క్యూలైన్ లో నిలబడ్డ భక్తులు

## అన్నదానానికి లక్ష రూపాయల విరాళం అందజేత


విరాళం అందిస్తున్న దృశ్యం

**బాసర (మన వెలుగు) జనవరి 17 :** చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారికి శుక్రవారం గుంటూరు జిల్లాకు చెందిన రమామూర్తి దంపతులు లక్ష రూపాయల చెక్కును ఇన్చార్జి ఈవో నవీన్ కుమార్ కు అందజేశారు. లక్ష రూపాయల విరాళాన్ని అన్నదానానికి వినియోగించాలని దంపతులు కోరారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్చార్జ్ ఈవో నవీన్ కుమార్ వీరిని శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.అన్న ప్రసాదానికి విరాళం ఇచ్చిన పుణ్య దంపతులను పలువురు అభినంధించి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని కోరారు.

## మన వెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ములుగు ప్రతినిధి, (మన వెలుగు) జనవరి 17 :** ములుగు జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మన వెలుగు నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సమస్యను (మన వెలుగు) పత్రికలో తీసుకువచ్చి ప్రజల సమస్యలను తీర్చాలని ఆయన కోరారు. మారుమూల గ్రామాల ఉన్న సమస్యలను ప్రతిదీ (మన వెలుగు) సమస్యలను బయటకి తీసి వచ్చి ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.అనంతరం ఎక్స్చేంజ్ డిపార్ట్మెంట్ డి.పి.ఈ.ఓ జయశంకర్ భూపాలపల్లి ఇంచార్జ్ వేముల శ్రీనివాస్, సీఐ సుధీర్ కుమార్ (మన వెలుగు) నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలుస్తున్న అనేక విషయాలు వెలికి తీసి ప్రజలను మేల్కొల్పాలని మన వెలుగు ఎప్పటికైనా ఇలాగే ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు దినదిన అభివృద్ధి చేరుకోవాలని ఆకాంక్షించారు ఇలాంటి నూతన సంవత్సరా లు ఇంకా ఎన్నో జరుపుకోవాలని కోరుకున్నారు ఈ సందర్భంగా మన వెలుగు రిపోర్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆష్ట గ్రామంలో సమగ్ర పరిశీలన


పరిశీలిస్తున్న దృశ్యం

**ముధోల్ (మన వెలుగు) జనవరి 17 :** ముధోల్ మండలం ఆష్ట గ్రామంలో నాలుగు పథకాల సర్వేలో భాగంగా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు పంచాయతీ సెక్రటరీ గంగాధర్ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది ఇంటింటా సమగ్ర పరిశీలన నిర్వహించారు. ఇందులో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల సర్వే చేశారు.తహసీల్దార్ శ్రీకాంత్ మరియు ఎంపీడిఓ శివకుమార్ లు ఆకస్మిక తనిఖీ చేశారు. అర్హులైన ప్రతీ ఒక పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేయాలని, గ్రామంలో ఉన్న నాయకులు కూడా తమ వంతు సలహాలు సూచనలు తెలియజేస్తూ సిబ్బందికి అండగా నిలిచి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

## అనునిత్యం విధులలో ఉండే పోలీసులకు క్రీడలు ఉత్సాహాన్ని కలిగిస్తాయి

- జిల్లా జడ్జి నీలిమ
- అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు
- ఇదే స్ఫూర్తిని జీవితంలోను,విధి నిర్వహణలోను కొనసాగించాలి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



బహుమతులు అందిస్తున్న దృశ్యం

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 17 :** అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో 3వ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి నీలిమ, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ గారు హాజరై క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి శ్రీమతి నీలిమ మాట్లాడుతూ,ఎంతో పని ఒత్తిడితో బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ వారికి స్పోర్ట్స్ మీట్ అనేది చాలా అవసరమని ఈ యొక్క స్పోర్ట్స్ మీట్ వల్ల మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించవచ్చు అన్నారు. మంచి ఆరోగ్యమే ఒక సంపద మంచి ఆరోగ్యం మనకు లభించాలంటే స్పోర్ట్స్ ద్వారానే వస్తుందని అన్నారు. రాబోయే రోజులో జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు మరింత ఉస్తానగా విధులు నిర్వహిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ,క్రీడలలో గెలుపోట ములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ఈ క్రీడల్లో పాల్గొనడం/పార్టిసిపేషన్ ముఖ్యమన్నారు. ప్రతిరోజు విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఆటవిడుపు గా ఇలాంటి క్రీడా పోటీల లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందరని అన్నారు. కష్టపడితేనే క్రీడల్లోనైనా, ఏ వృత్తిలోనై నా ఫలితం ఉంటుందన్నారు. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. అన్ని క్రీడల్లో హెూం గార్డు ఆఫీసర్ నుంచి అధికారుల వరకు మంచి పోటాపోటీ ని ఇస్తూ క్రీడాస్ఫూర్తిని కనబరచాలని అన్నారు. స్పోర్ట్స్ లో ఇన్వాల్వెంట్ ద్వారా జీవితంలో లక్ష్యాలకు దగ్గరగా చేరుకో గలుగుతమని. ఈ యొక్క స్పోర్ట్స్ మీట్ వల్ల ఉద్యోగుల్లో టీం వర్క్ అనేది ఏర్పడుతుందని అన్నారు. టీం వర్క్ వల్ల ఎప్పుడు విజయాలే కలుగుతాయని ఈ యొక్క స్పోర్ట్స్ మీట్ అనేది ఇంత విజయవంతం కావడానికి టీం వర్క్ ముఖ్య కారణం అన్నారు. ఈయొక్క పోలీస్ స్పోర్ట్స్ మీట్ ను ఇంత ఘనంగా నిర్వహించడం లో కృషి చేసిన జిల్లా అదనపు ఎస్పీ, డీఎస్పీలు, మరియు వారి టీం ని జిల్లా ఎస్పీ గారు అభినందించారు. మరియు యొక్క క్రీడా పోటీలను నిర్వహించిన పెట్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్రీడా పోటీలలో విజేతలకు జిల్లా జడ్జి నీలిమ, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు ట్రోఫీలు అందజేశారు. విజేతలు...ఓవరాల్ ఛాంపియన్ డార్ - జగిత్యాల,టగ్ ఆఫ్ ఫర్ విన్నర్ డార్ జగిత్యాల, రన్నర్స్ జగిత్యాల సబ్ డివిజన్, వాలీబాల్ విన్నర్స్ డార్ జగిత్యాల, రన్నర్స్ జగిత్యాల సబ్ డివిజన్, క్రికెట్ విన్నర్స్ డార్ జగిత్యాల, రన్నర్స్ మెట్ పల్లి సబ్ డివిజన్, ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, డిఎస్పీ లు రఘుచందర్, రాములు ,రంగా రెడ్డి ,ఏవో శశికల,డిసిఆర్బీ,ఎస్బి ఐటి కోర్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్, రఫీ ఖాన్, సి.ఐ లు రాం నరసింహారెడ్డి, వేణుగో పాల్,రవి,కృష్ణారెడ్డి, నిరంజన్ రెడ్డి ,సురేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు కిరణ్ కుమార్,రామకృష్ణ, వేణు మరియు ఎస్. ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ మోహన్ సింగ్


గాయాలపాలైన వ్యక్తితో కానిస్టేబుల్

**బాసర (మన వెలుగు) జనవరి 17 :** బాసర మండల కేంద్రంలోని గోదావరి నది మొదటి ఘాట్ నుండి రెండవ ఘాట్ కు వెళ్లే మార్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ నీటి ట్యాంక్ వద్ద గల కల్వర్ట్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి ముళ్ల పొదల్లో ఉన్నాడని బాసర గ్రామానికి చెందిన పుట్టొళ్ల గంగాధర్ ఒక విలేకరికి సమాచారం ఇవ్వగా అతను వెంటనే బాసర పోలీస్ లకు సంప్రదించడం జరిగింది.వెంటనే బ్లూకోట్ విధుల్లో ఉండి అప్రమత్తమైన కానిస్టేబుల్ మోహన్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకుని స్వల్ప గాయాల పాలైన వ్యక్తిని చేరదీసి ఆయన కుటుంబ సభ్యుల కు సమాచారం అందించారు.మెదక్ జిల్లా రెడ్డిపల్లికి చెందిన నర్సింలు గా పోలీసులు గుర్తించారు.వెంటనే స్పందించినందుకు కానిస్టేబుల్ మోహన్ సింగ్,ఇతర బ్లూకోట్ పోలీస్ సిబ్బందికి భక్తులు,స్థానికులు అభినందించారు.

## వాలిబాల్ టోర్నీ విజేతలు వీరేవాలిబాల్ టోర్నీ విజేతలు


బహుమతులు అందిస్తున్న దృశ్యం

**ముధోల్ (మనవెలుగు) జనవరి 17 :** కుబీర్ మండలం సిర్పెల్లి గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న వాలిబాల్ టోర్నమెంట్ లో భాగంగా మొదటి బహుమతి బెల్గామ్ తాండ, రెండవ బహుమతి పల్సీ గ్రామ టీమ్ లు గెలుచుకోడం జరిగింది. ఈ పోటీల్లో మొత్తం 14 గ్రామాలకు చెందిన జట్లు పాల్గొనడం జరిగింది. బహుమతు లను ముఖ్య అతిథిగా వచ్చిన కొట్టే హన్మాండ్లు మాజీ సర్పంచ్ గారు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడా నైపుణ్య తతో, స్నేహ భావంతో ఉండాలని జయాపజయాలు సాధారంగా తీసుకొని నేటి ఓటమియే రేపటి గెలుపునకు మనోధైర్యాన్ని, పట్టుదలను పెంచుతాయని తద్వారా యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యక రమైన జీవితం గడపడానికి ఇలాంటి క్రీడలు ఎంతో అవసరమని నేటి సమాజంలో చరవాణి చేతిలో బంధీలై పోయి వివిధ రకాల ఆటలు ఆడుతు చరవాణికి బానిసగా మారుతున్న తరుణంలో ప్రాంగణంలో ఆడే ఆటలు శరీర దారుఢ్యమే కాకుండా మనోవికాసాన్ని కూడా కలిగిస్తాయని తెలియజేసారు. ఇందులో భాగంగా పబ్బు ధర్మపురి, గంట గణేష్, బి రవి, సాయిప్రసాద్, బొండెల శ్రీనివాస్, పొత్యేవర్ కళ్యాణ్, ఏ నర్సయ్య , ఎమ్ విఘ్నేష్ , క్రీడ అభిమానులు, యువకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

## ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి

**- రాష్ట్ర పంచాయతీ రాజ్- గ్రామీణాభివృద్ధి-మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**



మాట్లాడుతున్న సీతక్క

**ముధోల్ (మన వెలుగు) జనవరి 17 :** ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ పథకాల అమలుపై ఉమ్మడి జిల్లా స్థాయి ప్రణాళిక కార్యాచరణ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అభిలాష అభినవ్, రాజార్షి షా, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విట్టల్, శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావ్ పటేల్, పాయల శంకర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మంత్రికి జిల్లా కలెక్టర్ పూల మొక్కతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సమావేశంలో పాల్గొని మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను పగడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.జనవరి 26 నుంచి ప్రారంభించనున్న పథకాలను రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, సంబందిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి, లబ్దిదారులను పకడ్బందీగా ఎంపిక చేయాల న్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందజేసే భాధ్యత అధికారులదేనన్నారు. రైతుభరోసా పథకానికి సంబందించి సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించాలని ఆదేశించారు. గ్రామాల్లో గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలను నిర్వహించి గుర్తించిన అర్హుల వివరాలను వెల్లడించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అలాగే ఉమ్మడి జిల్లాలో నిరుపేదలందరికీ మెరుగైన విద్య, వైద్యం, త్రాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం, తదితర వసతులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవలే నిర్మల్ ఉత్సవాలను విజయంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ కు, అధికారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో నూతన పథకాల అమలుకోసం అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించామన్నారు. పథకాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడతా మని, జిల్లాలో నూతన రేషన్ కార్డుల కోసం 17491 దరఖాస్తులు వచ్చాయని, సర్వే ద్వారా ఇప్పటివరకు 2924 మంది అర్హులను గుర్తించనట్లు తెలిపారు. దీనికి సంబం దించి సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల లబ్దిదా రుల వివరాలు గ్రామ, వార్డు సభలను నిర్వహించి గ్రామ సభల ఆమోదంతో సమగ్ర జాబితాను సిద్దం చేస్తామని తెలిపారు.ఆ తర్వాత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మట్లాడుతూ, కొత్త రేషన్ కార్డుల మంజూరూ, రైతు భరోసా, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ అందేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో లబ్దిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు.ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలులో ఏజెన్సీ ప్రాంతాల నిరుపేదలకు న్యాయం జరగాలని కోరారు. క్షేత్రస్థాయి సర్వేలో నిరుపేదలను గుర్తించి వారికి పథకాలను అమలు చేయాలన్నారు.అంతకుముందు రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను మంత్రి సీతక్క, కలెక్టర్లు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు రాజర్షి షా, కుమార్ దీపక్, వెంకటేష్ ధోత్రే, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, కుష్బూ గుప్తా ( ఐటిడిఒ పిఓ), శ్యామలా దేవి, దీపక్ తివారి, శాసనసభ్యులు రామారావ్ పటేల్, పాయల శంకర్, అనిల్ జాదవ్ లు, మున్సిపల్ చైర్మెన్లు గంద్రత్ ఈశ్వర్, మేడిపల్లి సత్యం, గ్రంథాలయ చైర్మెన్ సయ్యద్ అర్జుమంద్ అలి, మార్కెట్ కమిటీ చైర్మెన్లు ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

**- మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం.**

**- నిందితుడి వివరాలు వెల్లడించిన డిఎస్పీ రఘుచందర్**

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 17 :** ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు జగిత్యాల డిఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని చిన్నకెనాల్ వద్ద పోలీసులు వాహ నాల తనిఖీలు చేస్తున్న క్రమంలో ఎండి. ఆమేర్ అనే వ్యక్తి నంబర్ ప్లేట్ ద్విచక్రవాహనం వెళు తుండగా పోలీసులు వాహన పత్రాలు చూపించాలని కోరగా, అతను తడబడుతూ అక్క డి నుండి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు ఆమేర్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆమేర్ను విచారించగా జిల్లా కేంద్రంలో మూడు చోట్ల ద్విచక్రవాహనాలను చోరి చేసినట్లు ఒప్పుకున్నాడని, నిందితుడి వద్ద నుండి మూడు ద్విచక్రవా హనాలను స్వాధీనం చేసుకోని, రిమాండ్ తరలించినట్లు డిఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ వేణుగో పాల్, ఎస్ఐలు మన్మధరావు, గీత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




దొంగను పట్టుకున్న పోలీసులు

# దారి దోపిడికి పాల్పడిన నిందితుల అరెస్టు

**- 10 గంటల్లోనే కేసును చేధించిన పోలీసులు**

**- నిందితుడి వివరాలు వెల్లడించిన డిఎస్పీ**

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 17 :** గోవిందుపల్లి చౌరస్తా వద్ద దారి దోపిడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసిన రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల డిఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణానికి చెందిన దుర్గం సాయిబాబా అనే వ్యక్తి గురువారం రాత్రి తన పని ముగించుకొని ద్విచక్రవాహనం తన నివాసానికి వెళ్తున్న క్రమంలో గోవిందుపల్లి చౌరస్తా వద్ద ఇద్దరు దుండుగులు దుర్గం సాయిబాబాను అడ్డగించి చంపుతామని బెదిరించి, అతని వద్ద గల సెల్ఫోన్, నగదును ఎత్తుకెళ్లారు. సాయిబా బా ఫిర్యాదు మేరకు స్పందించి జగిత్యాల పట్టణ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను 10 గంటల్లోనే పట్టుకొని కేసును చేధించారన్నారు. నిందితులైన పోచంపల్లి శంకర్, సిరికొండ నరేష్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని తెలిపారు. దారి దోపిడి కేసును కేవలం 10 గంటల్లోనే చేధించిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డిఎస్పీ రఘుచందర్లు అభినందించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు మన్మధరా వు, గీత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ

# సమతఫౌండేషన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి సితక్కకు ఆహ్వానం

**ముధోల్ (మన వెలుగు) జనవరి 17 :** సమత ఫౌండేషన్ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ కోరారు. శుక్రవారం సమత ఫౌండేషన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క -ప్రజా ప్రతినిధులు-జిల్లా కలెక్టర్లకు ఆహ్వానం అందజేసారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల కేంద్రంలో ప్రారంభించే సమత ఫౌండేషన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ జిల్లా ఇన్చార్జి మంత్రి దానసరి అనసూయ సీతక్క-అదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సుగుణక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మా బొజ్జు పటేల్, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ పిసిసి జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేష్, గిరిజన కో-ఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి చైర్మన్ కోట్నాక తిరుపతి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కి ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సమత ఫౌండేషన్ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సమాజసేవను ఇంచార్జ్ మంత్రితోపాటు ప్రజాప్రతినిధులకు వివరించారు. మంత్రి సీతక్క-ప్రజాప్రతినిధులు సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ ఆహ్వానం పట్ల సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. సమత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సమతా ఫౌండేషన్ ఆర్గనైజర్, సీఈఓ అనిల్ కుమార్ , పిర్ ఓ క్రాంతి కుమార్ , సమత ఫౌండేషన్ సభ్యులు శేఖర్ ,ప్రవీణ్ , ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు యోగేష్, తదితరులు పాల్గొన్నారు.




సీతక్కకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

# మొగిలి జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**ముధోల్ (మన వెలుగు) జనవరి 17 :** తానూర్ మండలంలోని మొగిలి గ్రామ శ్రీ మహాలక్ష్మి ఆలయం జాతరకు ఏర్పాట్లు పూర్తియ్యాయి. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడు కూడా ఆలయం-వీడీసీ కమిటీల ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మి మాత ఆలయంతో పాటు గ్రామంలోని ప్రధాన ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేక%శీ%గా ముస్తాబు చేశారు. శుక్రవారం సాయంత్రం బోనాల పండుగ, శనివారం జాతర, మల్లా యోధులకు కుస్తీ పట్టీలు నిర్వహించనున్నట్లు ఆలయ,వీడీసీ కమిటీల సభ్యులు తెలిపారు. కుస్తీ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.7051లు, ద్వితీయ బహుమతిగా రూ.5051 రూపాయల నగదు అందించనున్నారు. ఈ కుస్తీ పోటీల్లో తలపడి గెలుపొందిన ప్రతీ మల్లాయోదునికి బహుమతులు అందిస్తామని శనివారం మధ్యాహ్నం 1:00 గంటకు కుస్తీ పోటీలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు..జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కోసం ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు, మల్లాయోదులు అధిక సంఖ్యలో తరలిరావాలని జాతర ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



శ్రీ మహాలక్ష్మి ఆలయం

# లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు చేయండి

**ముధోల్ (మన వెలుగు) జనవరి 17 :** ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్కు తాజా మాజీ సర్పంచ్ శ్వేతా రవి కిరణ్ గౌడ్ ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సమక్షంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 130 కుటుంబాలు రేషన్ కార్డుల కొరకు అర్హత కలిగి ఉన్నారని పేర్కొన్నారు. అయితే అధికారులు కేవలం 70 రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని తెలిపారు. దీంతో అర్హత కలిగిన మిగతా కుటుంబాలు ఆందోళనకు గురి అవుతున్నారని విన్నవించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు.



కలెక్టర్కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

# ఘనంగా తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు


**ముధోల్ (మన వెలుగు) జనవరి 17 :** నిర్మల్ జిల్లా తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షులు గైని సాయి మోహన్ మల్లన్న జన్మదిన వేడుకలు రైతులతో ఘనంగా నిర్వహించారు. గైని సాయి మోహన్ మాట్లాడుతు...బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తీన్మార్ మల్లన్న గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజా సేవకుడిగా ప్రజలకు ఆపద వస్తే తన ఆపదగా భావిస్తూ ముందడుగు వేస్తూన్నారు అని అన్నారు . రాజకీయ నాయకులు చేస్తున్న అవినీతి అక్రమాలు బయటపెడుతూ..తనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టిన భయపడకుండా పోరాడుతున్న గొప్ప నాయకుడని అన్నారు.తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు ఈరోజు రైతులు జరుపుకోవడం చాలా గొప్ప విషయం. మల్లన్న లాంటి వ్యక్తి రాబోయే రోజుల్లో బీసీ ముఖ్యమంత్రి కావాలని రైతులు అనదోచవన్ని వెళ్ళబుచ్చారు. క్యూ న్యూస్, శనార్తి తెలంగాణ వేదిక ప్రజలను చైతన్య పరుస్తూనారు. ఏ పార్టీలో ఉన్న ప్రతిపక్షం లో ఉన్న ప్రభుత్వం లో ఉన్న ప్రజలకోసం పనిచేసే ఏకైక వ్యక్తి అని రైతులు అన్నారు.



కేక్ తినిపిస్తున్న దృశ్యం

# అఘోరాల మధ్య అఖండ 2 తాండవం

హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ పూర్తి చేసుకుని మరో సంచలనం కోసం అఖండ 2 తాండవం మొదలుపెట్టిన దర్శకుడు బోయపాటి శీను మహాకుంభమేళాకు వెళ్లి కోట్లాది మధ్య జనసందోహం మధ్య షూటింగ్ చేయడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. ప్రయాగరాజ్ లో జరుగుతున్న ఈ అద్భుత ఉత్సవానికి సగటున రోజు యాభై లక్షలకు పైనే భక్తులు హాజరవుతున్నారు. అఘోరాల విన్యాసాలు, సన్యాసుల సమూహాలు, దేవతా మూర్తుల ఊరేగింపులు, భక్తుల ఆనంద పారవశ్యాలు చూసేందుకు రెండు కళ్ళు చాలవు. ఫిబ్రవరి 26 వరకు జరిగే కుంభమేళాకు మొత్తం దేశ జనాభాలో పాతిక శాతానికి పైగా పాల్గొంటారని ఒక అంచనా. అలాంటి చోట చిత్రీకరణ అంటే పెద్ద సవాలే. అయితే బోయపాటి బాలకృష్ణను తీసుకెళ్లి చేయలేదు. ఒక ముఖ్యమైన ఘట్టానికి సంబంధించిన ఫుటేజ్ తీసుకోవడంతో పాటు కొన్ని సన్నివేశాలు షూట్ చేశారని తెలిసింది. మళ్ళీ ఇంకోసారి వెళ్లే అవకాశం ఉంది. అఖండ 2 కథ మొత్తం పెద్ద బాలయ్య చుట్టే తిరగనుంది. లోక వినాశనానికి పూనుకున్న దుష్టశక్తులను అంతమొందించేందుకు అపారమైన దివ్య శక్తులను ప్రోగు చేసుకునే క్రమంలో చాలా కీలకమైన ఎపిసోడ్ ఈ బ్యాక్ డ్రాప్ లో ఉంటుందట. తెరమీద చూస్తే రోమాలు నిక్కబొడుచుకునే స్థాయిలో దీని తాలూకు సీన్లు ఉంటాయని తెలిసింది. సెప్టెంబర్ లో విడుదల ఫిక్స్ చేసుకున్న అఖండ 2 ఎలాంటి అవాంతరాలు లేకుండా అనుకున్న టైంకి రిలీజ్ చేసేలా బోయపాటి శీను పక్కా ప్లానింగ్ తో ఉన్నారు. డాకు మహారాజ్ రిలీజైపోయింది కాబట్టి బాలకృష్ణ పూర్తి డేట్లు దీనికే కేటాయించబోతున్నారు. సింహా, లెజెండ్, అఖండలతో ఒకదాన్ని మించి మరొకటి ఘనవిజయాలు అందుకున్న హీరో దర్శకుడి కాంబోగా ఈ ప్యాన్ ఇండియా మూవీ మీద మాములు అంచనాలు లేవు. తమన్ అయిదోసారి బాలయ్యకు ఛార్ట్ బస్టర్ బీజీఎమ్, పాటలు ఇచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ప్రగ్య జైస్వాల్ తో పాటు మొదటి భాగం తారాగణం ఇందులో భాగం కానుంది.



# నెవర్ బిఫోర్ రికార్డుల సంక్రాంతి

సంక్రాంతికి ప్రతిసారీ మూడు నాలుగు సినిమాలు రిలీజ్ కావడం మామూలే. కానీ వాటిలో ఒకటి రెండు మంచి టాక్ తెచ్చుకుని దూసుకెళ్తాయి. మిగతావి బోల్తా కొడుతుంటాయి. సంక్రాంతికి 100 పర్సంట్ సక్సెస్ రేట్ చాలా అరుదుగా కనిపిస్తుంటుంది. 2017లో ఆ అరుదైన దృశ్యమే చూశాం. ఖైదీ నంబర్ 150, గౌతమీపుత్ర శాతకర్ణి, శతమానం భవతి చిత్రాలు మూడూ పాజిటివ్ టాక్ తెచ్చుకుని మంచి వసూళ్లు సాధించాయి. దానికి ముందు, తర్వాత ఎప్పుడూ సంక్రాంతికి 100 పర్సంట్ సక్సెస్ చూడలేదు. ఐతే ఈ ఏడాది రిలీజైన మూడు సినిమాల్లో ఏదీ పూర్తి నెగెటివ్ టాక్ తెచ్చుకోకపోవడం విశేషం. మూడు చిత్రాలకూ ఓపెనింగ్స్కు ఢోకా లేదు. సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ దిశగా దూసుకెళ్తుండగా.. 'డాకు మహారాజ్' సూపర్ హిట్ దిశగా అడుగులు వేస్తోంది. యావరేజ్ టాక్తో మొదలైన 'గేమ్ చేంజర్' పడుతూ లేస్తూ సాగుతోంది. ఆ చిత్రానికి నష్టాలు తప్పవు కానీ.. ఫ్లాప్ అనే పరిస్థితి అయితే లేనట్లే కనిపిస్తోంది. ఇప్పటిదాకా సంక్రాంతికి ఎన్నడూ జరగని ఓ ఘనత ఈసారి సాధ్యమవుతుండడం విశేషం. తెలుగు నుంచి రిలీజైన మూడు చిత్రాలూ వంద కోట్ల గ్రాస్ కలెక్షన్ల క్లబ్బులోకి అడుగు పెడుతున్నాయి. 'గేమ్ చేంజర్' తొలి రోజే ఈ మార్కుకు చేరువగా వెళ్లింది. ప్రస్తుతం కలెక్షన్లు రూ.200 కోట్ల మార్కుకు చేరువగా ఉన్నాయి. 'డాకు మహారాజ్' విడుదలైన నాలుగో రోజు వంద కోట్ల క్లబ్బులోకి అడుగు పెట్టింది. 'సంక్రాంతికి వస్తున్నాం' తొలి రోజే రూ.45 కోట్లు కొల్లగొట్టింది. రెండో రోజుకు వసూళ్లు రూ.80 కోట్లకు చేరుకున్నాయి. ఈ రోజు ఈ చిత్రం వంద కోట్ల క్లబ్బులోకి అడుగు పెట్టడం లాంఛనమే. దేని టాక్ ఎలా ఉంది, అంతిమంగా ఎలాంటి ఫలితాన్ని అందుకోబోతున్నాయి అన్నది పక్కన పెడితే.. తెలుగులో ఈ పండక్కి రిలీజైన ప్రతి సినిమా వంద కోట్ల క్లబ్బులోకి అడుగు పెట్టడం టాలీవుడ్ బాక్సాఫీస్ స్టామినాను ప్రపంచానికి చాటి చెప్పేదే. మొత్తంగా ఈ సంక్రాంతికి టాలీవుడ్ బాక్సాఫీస్ రూ.500 కోట్లకు పైగా బిజినెస్ చేసేలా కనిపిస్తుండడం విశేషం.

